క్లుప్తంగా

మానవత సహాయం



వృద్ధుడికి సాయం అందిస్తున్న మానవత సభ్యులు

పోలవరం రూరల్: కొత్తరామయ్యపేటలో ఆదివారం మానవత ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన గనిశెట్టి పోలరాజు కొంతకాలంగా పక్షవాతం వ్యాధితో బాధపడుతున్నాడు. ఆ వృద్ధుడికి వైద్య అవసరాల నిమిత్తం రూ.5 వేలు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అందించినట్లు మానవత సభ్యుడు గణేష్ తెలిపారు. మానవత సభ్యులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ముఖ్య నేతల సమావేశం

కొయ్యలగూడెం: రేపల్లెవాడ సురేష్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గం ముఖ్య నేతలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అధ్యక్షతన నిర్వహిస్తున్న ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు హాజరుకావాలని కోరారు. ఈనెల 24వ తేదీ కొయ్యలగూడెంలో నిర్వహించే ఏలూరు వైఎస్సార్‌సీపీ పార్లమెంట్, పోలవరం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిల పరిచయ సభపై ఈ సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు.

డీఎస్పీ ఆకస్మిక తనిఖీ



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరం పోలీస్‌స్టేషన్‌ను జంగారెడ్డిగూడెం డీఎస్పీ ధనుంజయుడు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను డీఎస్పీ పరిశీలించి కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కేసులు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశాలు చేశారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా నడుచుకుంటూ వారి సమస్యలను త్వరతిన పరిష్కరించేలా పనిచేయాలన్నారు. స్టేషన్ పరిధిలో ఎక్కడా జూద క్రీడలు జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఎస్సై దుర్గా మహేశ్వరరావు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' విజేతలకు క్రీడాసామగ్రి అందజేత



విజేతలకు క్రీడా సామగ్రి అందజేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: అడుదాం ఆంధ్ర మండల స్థాయి ఆటల పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం బాలుర హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించారు. మండలస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు క్రికెట్, వాలీబాల్, కోకో, టెన్నికాయిడ్, బ్యాడ్మింటన్ క్రీడా సామగ్రిని క్రీడాకారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు గంజిమాల రామారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి, ఎంపీటీసీ ఘంటా శ్రీనివాసు, సొసైటీ అధ్యక్షుడు మంతెన సోమరాజు, మండల పార్టీ ప్రెసిడెంట్ గొట్టాడి నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ మట్టా సత్తిపండు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగివైరు చోరీ

జంగారెడ్డిగూడెం: ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగివైరు చోరీపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ బి.విద్య తెలిపారు. పేరంపేట గ్రామానికి చెందిన భీమడోలు గోపాలకృష్ణ వ్యవసాయ పొలంలో కొత్తూరి దుర్గారావు పేరు మీద ట్రాన్స్‌ఫార్మర్ ఉందన్నారు. ఈ నెల 20వ తేదీన పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను కింద పడవేసి దానిలో ఉన్న రాగి వైరును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారన్నారు. 21వ తేదీన గోపాలకృష్ణ పొలానికి వెళ్లేసరికి ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి రాగివైరు చోరీ చేసి ఉండటాన్ని గుర్తించి ఫిర్యాదు చేశాడన్నారు. వైరు విలువ రూ.20 వేలు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వ్యక్తి అరెస్ట్

జంగారెడ్డిగూడెం: అక్రమంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ బి.విద్య తెలిపారు. మండలంలోని శ్రీనివాసపురానికి చెందిన అద్దంకి గంగాధరరావు, రూ. 710 విలువ గల నాలుగు మద్యం బాటిళ్లు కలిగి ఉండటంతో అరెస్టు చేసినట్లు ఆమె చెప్పారు.

లెనిన్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

జంగారెడ్డిగూడెం: సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ధర్మన్న స్మారక భవనంలో పార్టీ డివిజన్ కార్యదర్శి ధర్ముల సురేష్ అధ్యక్షతన ఆదివారం కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి నిర్వహించారు. ఈ సభలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.సుధాకర్ మాట్లాడుతూ లెనిన్ ప్రదర్శించిన విప్లవస్ఫూర్తి, నిరాడంబరత, నిజాయితీ కమ్యూనిస్టులకు ఆదర్శప్రాయమని తెలియజేశారు. లెనిన్ విప్లవస్ఫూర్తితో విప్లవకారులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సభలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు పి.శ్రీనివాస్, ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ, సరియం రామ్మోహన్, వెట్టి సుబ్బన్న, కారం రాఘవ, సీహెచ్ రమేష్ పాల్గొన్నారు.

మారుతున్న సర్కారీ బడుల రూపురేఖలు

- కార్పొరేట్ స్థాయిలో వసతులు
- నియోజకవర్గంలోని 158 పాఠశాలల్లో సుమారు రూ.50.69 కోట్లతో ఆధునీకరణ పనులు
- డిజిటల్ తరగతుల నిర్వహణ



జీలుగుమిల్లిలో నాడు-నేడులో అందంగా రూపుదిద్దుకున్న పాఠశాల

బుట్టాయగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మన్యంలో ప్రభుత్వ పాఠశాలలు నూతన రూపురేఖలు సంతరించుకుంటున్నాయి. టీడీపీ పాలనలో ప్రభుత్వ బడుల్లో కనీస వసతులు కరువయ్యాయి. పైకప్పులేక పెచ్చులు ఊడిపోయిన గోడలు, మట్టి నేలపై విద్యార్థులు కూర్చునే దుస్థితి ఉండేది. అలాగే తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు ఉండేవి కావు. అదేవిధంగా అరకొర ఉపాధ్యాయులతో బోధన సాగేది. అయితే ఇదంతా గతం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత విద్యా వ్యవస్థలో సమూల మార్పును తీసుకువచ్చారు. పాఠశాలల అభివృద్ధికి నాంది పలికారు. నాడు-నేడు పథకం ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చించి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అధునిక సౌకర్యాలు కల్పించారు. దీనితో మన్యంలోని పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. నాణ్యమైన బోధన, ఆహ్లాదకరమైన వాతావరణం సంతరించుకోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివించేందుకు పిల్లల తల్లిదండ్రులు కూడా ఆసక్తి చూపిస్తున్నారు. దీనితో ప్రభుత్వ పాఠశాలలో చేరేవారి సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తుంది.

158 పాఠశాలల్లో రూ.50.69 కోట్లతో పనులు

పోలవరం నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో సుమారు 158 పాఠశాలల్లో రూ.50.69 కోట్లతో నాడు-నేడు పథకంతో పాఠశాలల ఆధునీకరణ సౌకర్యాలకు పనులు చేయడం జరిగింది. మొదటి దశలో 104 పాఠశాలలు, రెండో దశలో 54 పాఠశాలల చొప్పున పాఠశాలల రూపురేఖలు మార్చడం జరిగింది.



బుట్టాయగూడెం మండలం రెడ్డికోపల్లి పాఠశాలలో డిజిటల్ బోధన చేస్తున్న దృశ్యం



బుట్టాయగూడెం మండలం ఎస్ఆర్‌పాలెం పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైయర్స్



గిరిజన పాఠశాలలో బాలుర కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి

బోధనలో నవశకం.. బిగ్ స్క్రీన్‌లపై పాఠ్యాంశ బోధన

విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలను ప్రవేశపెట్టిన సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా వసతులు కల్పించడమే కాకుండా బైజూస్ కంటెంట్‌తో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు కూడా అందించడం జరిగింది. అలాగే గతంలో నల్లబల్లలు, పచ్చని బల్లలు ఉండేవి. వాటిమీద సుద్దముక్కలు, డస్టర్‌లతో విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠాలు బోధించేవారు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ బోధన విధానంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అన్ని పాఠశాలల్లో డిజిటల్ విద్యకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశారు. దీనితో దృశ్య, శ్రవణ రూపంలో జరిగే విద్యాబోధనలో విద్యార్థులు చాలా సులభంగా విద్యను నేర్చుకుంటున్నారు.

అడ్మిషన్లు పెరుగుతున్నాయి



ప్రభుత్వం నాడు-నేడు పథకంలో పాఠశాలల్లో మెరుగైన వసతులు అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన భోజనం, ఉత్తమ బోధన, ఇతర సదుపాయాలు కల్పించడంతో తల్లిదండ్రులకు ప్రభుత్వ బడుల పట్ల ఆసక్తి పెరిగింది. అడ్మిషన్లు కూడా పెరుగుతున్నాయి.

– తెల్లం బాబూరావు, ఎంఈఓ, బుట్టాయగూడెం మండలం

నాడు-నేడుతో పాఠశాలల అభివృద్ధి



టీడీపీ పాలనలో ప్రభుత్వ బడుల్లో కనీస సౌకర్యాలు ఉండేవి కావు. మరుగుదొడ్లు, మంచినీటి సమస్యలు, శిథిలమైన భవనాలు ఉండేవి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ పరిస్థితులను పూర్తిగా మార్చివేశారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు- నేడు పథకంలో అభివృద్ధి చేశారు.

– తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే, పోలవరం

నేడు విజయదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శ్రీపంచముఖ మరకత లింగేశ్వర సమన్విత శ్రీచక్ర సహిత శ్రీవిజయ దుర్గ అమ్మవారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ శాశ్వత కమిటీ సభ్యులు తెలిపారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం సందర్భంగా భక్తులకు ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి రామ భక్తులతో జంగారెడ్డిగూడెం పట్టణ పురవీధులలో ద్విచక్ర వాహన బైక్ ర్యాలీ, అనంతరం విజయదుర్గమ్మ వారి ఆలయ ప్రాంగణంలో హనుమాన్ చాలీసా పారాయణం, దీపోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ కోరింది.

ముగిసిన పండుగ సెలవులు



కొయ్యలగూడెం బస్టాండ్ ప్రయాణికులతో రద్దీగా ఉన్న దృశ్యం

కొయ్యలగూడెం: సంక్రాంతి పండుగ సెలవులు ముగిశాయి. ప్రభుత్వం ప్రకటించిన సంక్రాంతి సెలవులు ఆదివారంతో ముగియడంతో బంధువర్గాలు, మిత్రులు తమ గమ్యస్థానాలకు తిరుగుముఖం పట్టారు. ఈ నేపథ్యంలో కొయ్యలగూడెం బస్టాండ్ ప్రయాణికులతో రద్దీగా మారింది. దీంతో కొందరు ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దాదాపు పక్షం రోజులపాటు బంధువర్గంతో ఆనందంగా గడిపిన ప్రజలు మధురానుభూతులను వెంట తీసుకొని బయలుదేరారు.

చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



చింతలపూడిలో దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విజయరాజు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు

చింతలపూడి: చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద ఆదివారం వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులతో పరిచయ సమావేశం నిర్వహించారు. తొలుత కార్యాలయం ఆవరణలో ఉన్న దివంగత నేత డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో విజయరాజు మాట్లాడుతూ తనకు సమన్వయకర్తగా అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో చింతలపూడి నియోజకవర్గాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవడానికి కార్యకర్తలు పట్టుదలతో కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. తాను స్థానికుడినేనని నియోజకవర్గ సమస్యలపై తనకు అవగాహన ఉందని చెప్పారు. పార్టీ నాయకులు చేపూరి ఖాదర్‌బాబు, గిరి భోగారావు, ఎస్ మోహన్‌బాబు, జి రాజేష్‌నాయుడు సమస్యలను సభలో వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపీపీ డాబి రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం.నీరజాసుధాకర్, వైస్ ఎంపీపీ గుత్తా కిషోర్, సర్పంచ్ ఆర్‌వీ రామారావు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి బి.చెంచమరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేయాలి



ఏలూరులో సునీల్‌కుమార్, విజయరాజును కలిసిన జంగారెడ్డిగూడెం నాయకులు

జంగారెడ్డిగూడెం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేయాలని, అందుకు పార్టీ శ్రేణులు నిరంతరం కృషి చేయాలని పార్టీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్‌కుమార్, పార్టీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఏలూరులోని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ నివాసం వద్ద పార్టీ ఇన్‌చార్జిలు పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ గెలుపొందేలా పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సునీల్ కుమార్, విజయరాజులను కలిసిన వారిలో ఉభయగోదావరి జిల్లా బూత్ కమిటీ కోఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి, ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు వందనపు సాయిబాల, జంగారెడ్డిగూడెం మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, సొసైటీ మాజీ డైరెక్టర్ చిప్పాడ వెంకన్న తదితరులు ఉన్నారు.

పరిచయ వేదిక

ఏలూరు పట్టణంలోని క్రాంతి కల్యాణ మండపంలో ఏలూరు పార్లమెంట్, చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల ఇన్‌చార్జిల పరిచయ వేదిక ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్‌కుమార్, పార్టీ చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల ఇన్‌చార్జులు కంభం విజయరాజు, తెల్లం రాజలక్ష్మి నాయకులు, కార్యకర్తలను పరిచయం చేసుకున్నారు. రానున్న ఎన్నికల్లో చురుగ్గా పనిచేసి వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఈ పరిచయ వేదిక సభకు జంగారెడ్డిగూడెం నుంచి మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, బత్తిన చిన్న, కౌన్సిలర్‌లు ఉగ్గం దుర్గాప్రసాద్, అయినాల వెంకటరమణమూర్తి, గెద్దాడ శ్రీను, షేక్ అమీర్, షేక్ జహీర్, పంది రాజా, తల్లాడ సంజయ్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ ఇన్‌చార్జిల పరిచయ వేదికలో పాల్గొన్న జంగారెడ్డిగూడెం నాయకులు

మంత్రి వనితను కలిసిన నాయకులు



మంత్రి వనితకు పూల బొకేను అందిస్తున్న పార్టీ మండల కన్వీనర్ వాసు, జెడ్పీటీసీ శామ్యూల్



మంత్రి వనితతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ద్వారకాతిరుమల: వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనితను పలువురు మండల నాయకులు ఆదివారం తాడేపల్లిగూడెంలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అందులో భాగంగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్ ఆమెకు పూలబొకేను అందించి, ద్వారకాతిరుమలకు రావాలని ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మండలంలోని రాజకీయ పరిస్థితులను మంత్రి వనితకు వివరించారు. అలాగే పార్టీ నాయకులు చెన్నూరి రామకృష్ణ, పానమాల ఉమామహేశ్వరరావు, రామాయణం నాగాచారి, యేసు, చిలుకూరి చంద్రం తదితరులు మంత్రి వనితను కలిశారు.

జగన్ ఆశయాలకు అనుగుణంగా..



అన్నపనేనివారిగూడెంలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న బీవీఎస్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు

లింగపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా తన శక్తికొలది సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు బీవీఎస్ రెడ్డి తెలిపారు. అన్నపనేనివారిగూడెంలో రూ.7 లక్షలతో నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను ఆయన సర్పంచ్ డి.రవీంద్ర, పార్టీ నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు మాట్లాడుతూ ఇప్పటికి ఎనిమిది గ్రామాల్లో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన బీవీఎస్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం 800 వాటర్ క్యాన్‌లను వైఎస్సార్ సీపీ నాయకులు చేతుల మీదుగా బీవీఎస్ రెడ్డి ప్రజలకు అందజేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ డి రవీంద్ర ఆధ్వర్యంలో గ్రామం తరుపున దాత బీవీఎస్ రెడ్డిని ఘనంగా సన్మానించి, మొమెంటోలు అందజేశారు. మండల వైఎస్సార్ సీపీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు చలగుళ్ల రవిబాబు, తాడేపల్లి శాంతరావు, కె రమేష్, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, మాజీ జెడ్పీటీసీ కట్టా సత్యనారాయణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి సహకారం

ధర్మాజీగూడెంలో సీఎస్ఐ చర్చి నిర్మాణానికి లింగపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు భీమిరెడ్డి వెంకటసూరారెడ్డి (బీవీఎస్‌రెడ్డి) ఆర్థిక సహకారం అందజేసేందుకు ముందుకు వచ్చారు. ఆదివారం ధర్మాజీగూడెం సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో సభ్యులు బీవీఎస్ రెడ్డిని కలిశారు. చర్చి హాల్‌కు సంబంధించి 4000 చదరపు మీటర్లకు టైల్స్ వేయించాలని, ఇందుకోసం రూ.4 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. సంఘ సభ్యులు కోరిక మేరకు చర్చి అభివృద్ధికి ఆర్థిక సహాయం అందజేస్తానని ఈమేరకు బీవీఎస్ రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో సంఘ సభ్యులు, విశ్వాసులు ఆయన్ను ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ జగన్మోహనరావు, ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్ పాల్గొన్నారు.

128 మందికి కంటి పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): లయన్స్‌క్లబ్ ఏలూరు జిల్లా చైర్మన్ మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో స్థానిక రామకోటి ప్రాంగణంలో వేమగిరి పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల వైద్యులు ఆదివారం 128 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 18 మందికి కంటి శుక్లాల శస్త్రచికిత్స అవసరమని ఆపరేషన్‌కు ఏర్పాటు చేశారు. 36 మందికి సబ్సిడీ ధరకు కళ్లజోళ్లు అందించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా ఉచిత నేత్ర వైద్య శిబిరం కొనసాగిస్తున్నామని, ప్రతి నెలా 3వ ఆదివారం రామకోటి ప్రాంగణంలో నిర్వహించే ఈ శిబిరాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చెక్కా రాజారావు, అల్లం వెంకట సుబ్బారావు, బొడ్డు శ్రీనివాసు, గొల్లపూడి రామకృష్ణ, బొలిశెట్టి సురేష్ కుమార్, చెన్నా వెంకట్రామయ్య పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

పెదపాడు: మండలంలోని ఏపూరులో పేకాడుతున్న ఏడుగురి వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ముందస్తు సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి ఎస్సై చల్లా కృష్ణ ఆదివారం విలేకరులకు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.3230 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

శ్రీరామ శోభాయాత్రకు సర్వం సిద్ధం

ద్వారకాతిరుమల: క్షేత్రంలో శ్రీరామ శోభాయాత్ర నిర్వహణకు సర్వం సిద్ధమైంది. అయోధ్యలో బాల రాముని ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం ఈ యాత్రను నిర్వహించనున్నారు. ముందుగా క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఉదయం 9 గంటలకు హిందూ భక్తులంతా కలసి శోభాయాత్రను ప్రారంభిస్తారు. ఈ యాత్ర శ్రీవారి పాదుకా మండపం వద్దకు చేరుకుంటుంది. అక్కడి నుంచి భక్తులంతా చెరువు వీధికి చేరుకుంటారు. అక్కడ సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపేందుకు ఉత్సవ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు ఆదివారం పూర్తి చేశారు. అలాగే క్షేత్రంలోని పలు ప్రధాన కూడళ్లలో రాముల వారి ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అలాగే కాషాయ జెండాలతో క్షేత్రం కళకళలాడుతోంది. ఇదిలా ఉంటే స్థానిక తూర్పు వీధిలోని ఆంజనేయ స్వామివారి ఆలయాన్ని నాయీ బ్రాహ్మణులు రంగులు, విద్యుద్దీపాలు, మామిడి తోరణాలు, అరటిబోదెలతో సుందరీకరించారు. అలాగే ఆలయంలోని సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామివారిని ముస్తాబు చేశారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు ఆలయంలో దీపాలు వెలిగించి సీతారాములకు పూజాదికాలను నిర్వహిస్తామని నాయీబ్రాహ్మణులు తెలిపారు.



కామవరపుకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సంఘం, వాసవి, వనిత క్లబ్ సభ్యులు



ద్వారకాతిరుమల తూర్పువీధిలోని ఆలయంలో ముస్తాబైన ఆంజనేయ స్వామి విగ్రహం

కే.కోటలో జైశ్రీరామ్ ర్యాలీ

కామవరపుకోట: అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠను పురస్కరించుకుని కామవరపుకోటలో ఆర్యవైశ్య సంఘం, వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక చౌతన సెంటర్లో గల సీతారామస్వామి ఆలయం నుంచి అన్ని ఆలయాలు కలుపుతూ, గ్రామ వీధుల్లో జైశ్రీరామ్ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ మండల అధ్యక్షుడు జయవరపు వరప్రసాద్ మాట్లాడుతూ సోమవారం శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గ్రామంలో భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించబడునని, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, వాసవి, వనిత క్లబ్ సభ్యులు నంబూరు ప్రసాద్, కంభంపాటి రత్నకుమారి, గుడిమెట్ల వెంకటలక్ష్మి, చవ్వా రాంబాబు, కర్పూరం కృష్ణమూర్తి, వందనపు మురళి, కొండూరు రామకృష్ణ, పత్తి కుమార్, వాసా వాసు, నల్లూరి ప్రభాకర్, కొండూరు శ్రీధర్, బచ్చు ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.